# విడాకులు

ఉదయం పోస్టులో ఏడు ఉత్తరాలు వచ్చాయి. వాటిల్లో రెండు శుభలేఖలు. ఆ రెంటికి నలుమూలాలా పసుపు రాయబడి ఉంది.

ఉత్తరం మీది చేతి వ్రాతని చూసి అది ఎవరినించి వచ్చిందో గుర్తించగలను. ఆ వ్యక్తినించి ఉత్తరం ఎదురుచూస్తుంటే ముందు అది చదవడం అలవాటు.

ఆ రోజు వచ్చిన ఉత్తరాల్లో పసుపు రాసిన కవర్లే నాకు ఆసక్తికరంగా కనబడ్డాయి. ఒకదాని మీద నా చిరునామా టైప్ చేయబడి ఉంది. ముందర దాన్ని విప్పి చూశాను. మరో ఎనిమిది రోజుల తర్వాత కదిరి గ్రామంలో జరగబోయే పెళ్ళికి ఆహ్వాన పత్రిక అది.

ఎవరో తెలియదు.

తరచు నాకు ఆలా కొత్త వ్యక్తుల నించి వెడ్డింగ్ కార్డులు రావటంపరిపాటే. తమ అభిమాన రచయిత నించి శుభాకాంక్షలు అందుకోవాలని పంపుతుంటారు.

మరొక కవరుమీద ఉంది నా ఆలోచనంతా. ఆ కవరు మీది చేతివ్రాత పాండురంగానిది. ఆరు సంవత్సరాలనించి నాకు స్నేహితుడయిన పాండురంగానికి వివాహం అయి నాలుగు సంవత్సరాలయింది. శుభలేఖ పంపాల్సిన అవసరం లేదు అతనికి.

ఆ కవరులోంచి ముద్రింపబడ్డ కార్డు బయటకు తీశాను. రెండుసార్లు ఆ కార్డు చదివాను. కాని, నాకేం అర్థం కాలేదు వెంటనే. ఇంగ్లీషులో రాసి ఉంది.

"ఆహ్వాన పత్రిక.

పాండురంగం, అతని భార్య బుధవారం, విడాకులు తీసుకునే శుభ సందర్భంలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులోని ఫస్ట్ అడిషనల్ జడ్జి కార్యాలయానికి రావలసిందిగా ఆహ్వానిస్తున్నారు. 13—5—1981 న విడాకులు మంజూరు చేయబడుతోంది.

సమయం: సుమారు పన్నెండు గంటలు."

అదే రోజు రాత్రి ఏడున్నరకి హోటల్ ఎమరాల్డ్‌లో ఇవ్వబడే డిన్నర్‌కి కూడా రావలసిందిగా శ్రీ మరియు శ్రీమతి పాండురంగం ఆహ్వానిస్తున్నారు.

షరా : బహుమతులు తీసుకు రావద్దని మనవి."

పాండురంగానికి, పాండురంగం భార్యకి మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవు నాకు తెలిసినంతవరకు.

వెంటనే టెలిఫోన్ నంబర్ల జాబితా రాసుకునే పుస్తకం తిరగేసి ఒక నంబర్ తిప్పాను.

పాండురంగం ఆ రోజు సెలవులో ఉన్నాడని అతను పనిచేసే ఆఫీసు నించి జవాబొచ్చింది.

వాళ్ళు విడాకులదాకా వెళ్ళారని తెలియదు నాకు. ఏమై ఉంటుంది? ఎవరైనా మరణించారని తెలిస్తే ఎలా బాధపడతానో, వారి విడాకుల గురించి తెలిశాక కూడా అలాగే మనసు చివుక్కుమంది.

అనేకసార్లు వారింటికి వెళ్ళి భోజనంచేసి, వారి కుటుంబంతో సినిమాకి వెళ్ళాను. ఇక వారిద్దరు కలిసి ఉండరు అన్న సంగతి తెలిస్తే బాధగా ఉంది.

వారిద్దరి పిల్లలు ఏమవుతారు?

మర్నాడే గురువారం.

• • •

కోర్టుకు వెళ్ళడం అంటే ఈ కాలంలో కూడా చాలామందికి భయం. జైలుకి వెళ్ళొచ్చినంత సిగ్గుపడతారు, ఏదైనా కేసులో సాక్ష్యం చెప్పడానికైనా వెళ్ళాల్సివస్తే. కేవలం నేరస్థులే కోర్టుకి వెళ్తారన్నది స్థిరమైన నమ్మకం చాలామంది చదువుకున్నవాళ్ళలో కూడా ఉంది.

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

గురువారం సెలవుపెట్టి మదీనా ప్రాంతంలో ఉన్న సిటీ సివిల్ కోర్టుకి చేరుకున్నాను. ఉదయం పదిన్నరకి ఫస్ట్ అడిషనల్ జడ్జి ఉండే కోర్టు హాల్లోకి వెళ్ళాను.

అప్పటికే ఐదుగురు పాండురంగం మిత్రులు విజిటర్స్ బెంచీ మీద కూర్చుని ఉన్నారు. వాళ్ళ మధ్య కూర్చుని ఉన్నాడు పాండు రంగం.

"అందిందా?" అడిగాడు, నన్ను చూడగానే లేచి నిలబడి. "కంగ్రాచ్యులేషన్స్" చెప్పాడు లేచి దగ్గరకు వచ్చి నాతో కరచాలనం చేసి.

"ఏమైంది?" అడిగాను.

"ఏమిటి ఏమైంది?"

"విడాకులు తీసుకునేదాకా రావడానికి ఏమైంది?" నవ్వాడు. జవాబు చెప్పలేదు.

"ఇంకా ఎంతమందిని పిల్చావ్?" అడిగాను.

"మా పెళ్ళికి వెడ్డింగ్ కార్డులు పంపిన ప్రతి వారికి పంపాను డైవోర్స్‌కార్డ్స్. మేం పెళ్ళిచేసుకున్నాం అని తెలియచేసిన ప్రతి వారికి విడాకులు తీసుకుంటున్నాం అని తెలియచేయడం సబబే కాదా?" అడిగాడు.

"సబబే కాని, ఇదేదో ఫంక్షన్ లాగా ..."

సెంట్ వాసనతోపాటు పాండురంగం భార్య పద్మావతి లోపలికి వచ్చింది. నన్ను చూసి పలకరింపుగా నవ్వింది. విడాకులు తీసుకుంటున్నాననే బాధ ఆమెలో కూడా నా కెక్కడా కనబడలేదు. పైగా పెళ్ళి జరుగుతున్నట్లు కాళ్ళకి పసుపు, పారాణి రాసుకుని పట్టుచీర కట్టుకుని ఉంది. సెంట్ వాసన గుబాళిస్తోంది.

"మీ కిష్టమేనా?" ఆమెని అడగకుండా ఉండలేక పోయాను, పద్మావతి తన భర్తని చిరునవ్వుతో, 'గుడ్ మార్నింగ్' అని గ్రీట్ చేయటంతో.

"ఇష్టమే! మ్యూచువల్ కన్‌సెంట్‌తో విడిపోతున్నాం." చెప్పింది.

"బ్రహ్మచారికి మ్యూచువల్ కన్‌సెంట్ గురించి తెలియదు." నవ్వాడు పాండురంగం.


"భార్యా భర్తలు విడిపోవడానికి నిశ్చయించుకుని విడాకుల కోసం ఇద్దరూ కలిసి పిటీషన్ పెట్టుకుంటే కోర్టు వారు నిరభ్యంతరంగా విడాకులు మంజూరు చేస్తారు." చెప్పింది పద్మావతి.


"భార్యో, భర్తో ఒక్కరే విడాకులు రెండో వారికి ఇష్టం లేకుండా కోరితే అది రావడానికి చాలా కాలం పడుతుంది. మ్యూచువల్ కన్‌సెంట్ అయితే ఆరు నెలలు చాలు." చెప్పాడు పాండురంగ.'

పదకొండయింది ఉదయం.

గంటలు మోగాయి.

జడ్జి వస్తున్నట్లు కోర్టు బంట్రోతు గట్టిగా చెప్పాడు. ఫస్ట్ అడిషనల్ జడ్జి వచ్చి కూర్చున్నాడు.





కోర్టు క్లర్కు ఆ రోజు విచారించవలసిన కేసుల లోని వ్యక్తుల, లాయర్ల పేర్లు చెపితే, కోర్టులో హాజరవని వారి పేర్లు పిలుస్తున్నాడు బంట్రోతు.

దాదాపు పదిహేనుమంది వచ్చారు పాండురంగం తరఫున. పద్మావతి తరఫున ఇరవై మంది వచ్చారు.

ఫస్ట్ అడిషనల్ జడ్జి పాండురంగం కేసు తాలూకు జడ్జిమెంట్ చదవ సాగాడు ఇంగ్లీషులో. దాని సారాంశం...

"ఫలానా తారీఖు, ఫలానా నెల, ఫలాన సంవత్సరం పాండురంగం,పద్మావతికలిసి తమకి విడాకులు కావాలని పిటిషన్ పెట్టుకున్నారు.వారు ఉదాహరించిన కారణం పద్మావతిఒంగోలులో, పాండురంగం హైద్రాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్న కారణంగా కలిసి కాపరం చేసే అవకాశం వారిద్దరికీ లేదు. పాండురంగానికి ఒంగోలుకి కాని, పద్మవతికి హైద్రాబాద్‌కి కాని బదిలీలు కావు. వారిరువురికీ దాంపత్య సౌఖ్యం లేని కారణంగా విడాకులు తీసుకోవడం మంచిదని నిర్ణయించడంతో విడాకులు కోరారు. నేను వారిరువురినీ నా చాంబర్ లోకి పిలిచి సమాధాన పరిచే ప్రయత్నం చేసినా, వారి పట్టుదల వారు విడువలేదు. ఈ కారణంగా పాండురంగానికి, పద్మావతికి ఈ రోజు నించి—అనగా 13—5—1981 నించి విడాకులు మంజూరు చేస్తున్నాను.

వారు కోరుకున్న విధంగా పాండురంగం పెద్ద కొడుకు తల్లి పద్మావతి కస్టడీలో, రెండో కొడుకు తండ్రి పాండురంగం కస్టడీలో పెరగాల్సింది అని తీర్పు ఇస్తున్నాను. పద్మావతి ఉద్యోగస్థురాలు కాబట్టి తన సంపాదనతో తన కొడుకుని పోషించు కునే ఆర్థిక సామర్థ్యం తన కుందని పేర్కొంది. కాబట్టి పాండురంగం తన భార్యకు భరణం ఇవ్వాల్సిన అవసరం లేదనికూడా తీర్పునిస్తున్నాను."

జడ్జిమెంట్ చదవడం పూర్తవగానే పాండురంగం సంతోషంగా చూశాడు పద్మావతి వంక. ఆమెకూడా చిరునవ్వు నవ్వింది.

కోర్టు హాల్ లోంచి బయట వరండాలోకి రాగానే పాండురంగం మిత్రులంతా అతనితో కరచాలనం చేసి కంగ్రాచ్యులేషన్స్ చెప్పసాగారు. పాండురంగం మెడలో పూలహారాలని వేశాడు అతని తమ్ముడు.

పద్మావతినికూడా ఆమె మిత్రులు కంగ్రాచ్యులేట్ చేస్తున్నారు.

ఒక మిత్రుడు తనతో తెచ్చిన కెమెరాతో పాండురంగాన్ని మాత్రం విడిగా ఫోటో తీశాడు.

మరో మిత్రుడు స్వీట్స్ డబ్బా తెరిచి పాండురంగం నోట్లో స్వీట్ ఉంచి, "విష్ యు ఎ వెరీ హాపీ డైవోర్స్‌డ్ లైఫ్" అని తన శుభాకాంక్షలు తెలియజేశాడు.

"నువ్వు చెప్పవా?" అడిగాడు పాండురంగం నా దగ్గర కొచ్చి.

నేను పద్మావతికి, పాండురంగానికి కలిపి చెప్పాను.

"విష్ యు బోత్ ఎ వెరీ హాపీ అండ్ పీస్‌ఫుల్ డైవోర్స్‌డ్ లైఫ్."

"ఇవాళ రాత్రి నించి మంచమంతా నీదే."

"రేపటినుంచి పొద్దున్నే ఆరింటికి లేచి కాఫీ కలిపి మీ ఆయనకి అందించాల్సిన అవసరం లేదు."

"ప్రతి రెండో శుక్రవారం రాత్రి ఒంగోలు

బస్ ఎక్కా వవసరం లేదు నువ్వు.''

''ఇంక నీ కంతా ఆదానే. రోజుకో ఇన్‌లాండ్ కవర్ రాయక్కర్లేదు మీ ఆయనకి.''

స్నేహితులు వారిద్దరికీ నవ్వుతూ, భవిష్యత్తులో జరిగే చిన్న మార్పుల గురించి ఆనందంగా చెప్తుంటే చిరునవ్వుతో విన్నారు పాండురంగం, పద్మావతి.

''మగాళ్ళ కర్చీఫ్‌లు వుతకాలంటే మహా బద్ధకం నాకు.'' చెప్పింది పద్మావతి.

ఆ మాటలు విన్న పాండురంగం స్నేహితుడు చెప్పాడు.

''అందుకే మా వాడి చేతి రుమాలుని వాడి పాంట్ జేబులో ఉంచేసి ఉతికేవాళ్ళు మీరు.''

నవ్వులతో నిండిపోయింది కోర్టు వరండా.

కోర్టు బంట్రోతు వచ్చి నిశ్శబ్దంగా ఉండాలని మందలించాడు.

పదినిమిషాల తర్వాత కోర్టు రెండో అంతస్తు నించి కిందకి దిగాం. కింద రెండు కార్లు పూల మాలలతో అలంకరించి ఉన్నాయి.

పాండురంగం ఒక కారులో ఎక్కాడు. అది పాండురంగం పనిచేసే కంపెనీ మేనేజర్‌ది. మరొకటి పద్మావతి మామయ్యది.

రెండు కార్లు కదిలాయి. పాండురంగం కారు వెనక కట్టినసీమ టపాకాయలకి నిప్పంటించాడో స్నేహితుడు కారు కోర్టు ఆవరణ దాటగానే. అందరిదృష్టి కారు మీద పడింది, అవి పేలడంతో.

ఆ రెండు కార్ల వెనక రెండు కార్డ్‌బోర్డ్ అట్టలు కట్టి ఉన్నాయి. వాటి మీద ఇంగ్లీషులో రాసి ఉన్నాయి మూడే మూడు మాటలు.

''జస్ట్ డైవోర్స్‌డ్. హాపీ.''

• • • •

రాత్రి ఏడున్నరకి హోటల్ ఎమరాల్డ్‌లోకి అడుగు పెట్టాను.

మూడు టేబిల్స్ జతచేసి ఉన్నాయి. వాటి ముందు పాండురంగం, మిత్రులు కూర్చుని ఉన్నారు.

మరోచోట కూడా మూడు టేబిల్స్ జత చేసి ఉన్నాయి. వాటి ముందు పద్మావతి, ఆమె మిత్రులు కూర్చున్నారు.

పద్మావతిఅక్కడఉన్నాలేనట్లే ప్రవర్తించసాగాడు పాండురంగం. పద్మావతి కూడా పాండురంగం వంక కాని, అసలు మావైపే చూడడంలేదు. ఎవరి ఫ్రెండ్స్‌తో వాళ్ళు సరదాగా కబుర్లు చెప్తూ భోజనం చెయ్యసాగారు.

పాండురంగం కోర్టు నించి అతని లాయర్ తీసుకున్న డైవర్స్ డిక్రీని మా కందరికీ చూపించసాగాడు.

అటువైపు చూశాను.

సరిగ్గా పద్మావతి కూడా అదే పని చేస్తోంది, ఫ్రెండ్ వేసిన జోక్‌కి నవ్వుతూ.

వివాహం ద్వారా ఇద్దరు మనుషుల కలయికలో ఆనందం ఉన్నట్లే, కలసి బ్రతకలేని స్థితిలో విడిపోతే విడాకుల్లో కూడా మధురానుభూతి ఉంటుంది.

మరి కొన్ని రెట్లు అధికంగానే ఉంటుంది నిజానికి.

ఆ అందమయిన అనుభూతిని ఇతరులు ఎందుకు వింతగా చూడాలి! ★

# వారఫలాలు

**26-5-82 నుండి 1-6-82 వరకు**

## మేషం

ఈ వారంలో ప్రాప్తించే గ్రహస్థితిలో ఎక్కువ మార్పు సంభవించకున్నా, మిశ్రమ ఫలాలు అనుభవనీయం కానున్నవి. మీ కార్యాలు నిర్విఘ్నంగా కొనసాగవు. శ్రమానంతరం జయం నిదానంగా పొందగలుగుతారు. ఇందువలన మీరు అనుభవించే సామాన్య సుఖ శాంతులకు ఎలాటి భంగం వాటిల్లదు. మీ వృత్తిగోమాత్రం అవరోధాలు పరిష్కారం కావు.

## వృషభం

మీ స్నేహితులుగా ఉండి, మీ కీర్తి ప్రతిష్ఠలను భంగపరిచే ప్రయత్నం కావించే వారిని మీ రెరిగి ఉన్నారు. వారి కార్యకలాపాల సరళి మీకు చిర పరిచితం కాన వారిని కనిపెట్టి ఉండండి. మీ పై అపనిందల నారోపించి మీకు జీవితం దుర్భరంగా రూపొందించే ప్రయత్నాలు వారు ప్రారంభించారు. ఈ వారం లగాయతు ఇంకా కొంతకాలం ఇదితప్పదు.

## మిథునం

ఈ వారంలో లోగడ మీరు కావించిన పొరపాట్లకు పశ్చాత్తాపం పొంది వానిని సరిదిద్దుకొనే ప్రయత్నంలో ఉండండి. అహంకారం పతన హేతువు. ఇది అనుభవజ్ఞులైన మీరు ఎరగనిదికాదు. మేధావుల మను భావం సవ్యంగా ఉండాలి. అపసవ్య మార్గాలలో పయనించే వారి మేధ కొంతకాలం వరకే వారిని కాపాడుతుంది. కాన జాగ్రత్త వహించండి.

## కర్కాటకం

మీ వృత్తిలో కొంత మార్పు సంభవించే కాలంగా ఉంది. ఇందువలన అపకారం ఉండదు. భావి కాల పరిణామం ఆగస్టు అనంతరంగాని నిర్ణయించ సాధ్యం కాదు. గత వారం వలె ఈ వారంలో కూడా మీ పై అత్యాచారాలు జరప తలచిన వారు సమయం కొరకు నిరీక్షిస్తారు. దీనిని గ్రహించి మీ జాగ్రత్తలో ఎలాంటి లోపం జరగకుండా చూచుకోండి.

## సింహం

ఆరోగ్యం తృప్తికరంగా ఉండే విధంగా జాగ్రత్త పడండి. ఈ విషయంలో మీరు జాగ్రత్త వహిస్తే ఇతర సమస్యలు పరిష్కరించుట మీకు అసాధ్యమైన పనికాదు. ఆర్థిక రంగంలో ఎలాంటి ఇబ్బందులుండవు. మీ పై అధికారులతోను, సహచరులతోను వ్యవహరించే క్రమంలో పొరపాట్లు రారాదు. మీ ఆశ్రితులను కాపాడుట మీ ధర్మమని గుర్తెరిగిన వారని అందరకు విశదం గాన భయముండదు.

## కన్య

ఈ వారంలో సాంఘిక కార్యక్రమాలుగాని, వృత్తి వ్యవహారాలుగాని, స్త్రీ సంబంధ విషయాలుగాని ప్రాధాన్యం వహించి మిమ్ములను పెడత్రోవ పట్టించ నున్నవి. చిత్తానక్షత్ర జాతకులు స్త్రీలు గాని, పురుషులుగాని ఇతరులతో అక్రమ సంబంధాలు పొందే కాలం కాదు. మనో నిగ్రహించాలా అవసరం. త్వరపడి ప్రేమ వివాహాల వలయంలో పడేవారు సావకాశంగా పశ్చాత్తాప పడక తప్పదు.

## తుల

రాజకీయాలలో యుగంధరు లంతటి వారైనా పొరపాట్లు కావించక తప్పదు. ఈ స్థితి చిత్రా నక్షత్ర జాతకులకు సూచకం. ప్రజాభిమానం పొందుట అంటే బీదలను కొనుగోలు చేయడం కాదు. వారితో ఎలా వ్యవహరించవలసి ఉంటుందో ఆలోచించి వ్యవహరించండి. పోటీలలో జయం శ్రమానంతరంగాని సాధ్యం కాదు. ధన వ్యయం అధికంగా ఉంటుంది.

## వృశ్చికం

విశాఖ నక్షత్ర జాతకులు సర్వ విధాల జాగరూకులై ఉండాలి. వీరి ప్రయత్నాలు సంపూర్ణంగా భిన్న మార్గాలలో ఉండ నున్నవి. అనూరాధ వారికి కాలం ఇంకా అనుకూలప్రదం కాదు. సాహసించి ఏ కార్యాలకు పూనుకోరాదు. మిత్రులు, బంధువులు మీకు బహు రంగాలలో అండగా ఉంటారు. ఇతరులతో మీరు ప్రవర్తించే విధానంపై మీ భావి జీవితం ఆధారపడి ఉంటుంది.

## ధనుస్సు

వర్తమాన కాలం మీకు చాలా ప్రధానం. గ్రహబలం ఎంతైనా అనుకూలంగా ఉంది. జననకాలరీత్యా రాహుదశయం దున్నవారు గాని, గురుదశయం దున్న వారు గాని, లేదా పరస్పర దశాభుక్తులందున్న వారు గాని ఈ గోచార శుభత్వాన్ని సంపూర్ణంగా అనుభవించ నున్నారు. ఆర్థికంగా మీ జీవితంలో ఇది ప్రధాన కారిగా ఉంటుంది. శుభప్రదం.

## మకరం

మీ భాగస్వాములు మీకు అపకారం తలపెట్ట నున్నారు. మీతో అనుకూలంగా, అడకువగా వ్యవహరించే వారి వలన మీకు ఇబ్బందులు రానున్నవి. ప్రాపంచిక విషయ వాసనా బలం బలీయంగా గల మీకు మీ శత్రువులు కూడా ఈ రాసివారేనని గ్రహించండి. లేదా కన్యారాసి వారు మీకు అపకారం చేస్తారు. ఎంత జాగ్రత్తగా ఉంటే అంత శుభం.

## కుంభం

మీ విచక్షణా జ్ఞానానికి, మేధకు ఇది పరీక్షా కాలం. మీకు ప్రాప్తించిన సదవకాశాలను మీరు వినియోగం చేసుకొంటే చాలు. శ్రమ లేకుండా సుఖంగా కాలం గడిచిపోతుంది. అత్యాశకు పోతే దాని ననుసరించి కష్టాల పరంపర పాదలాగా వెంట నంటుతుంది. నిశిత బుద్ధితో ఆలోచించి నిర్ణయించే కార్యాలలో జయం లభిస్తుంది.

## మీనం

డిసెంబరు వరకు మీరు అధికంగా ప్రయాణాలు కావించవలెనని ఆలోచించి అందుకై తగిన ఏర్పాటు లన్నింటినీ కావించుకొనే కాలం. దైవం అనుకూలిస్తాడా, లేదా అని ఆలోచించరు. మీకు ఈ శాస్త్రంపై విశ్వాసం ఉంటే ఆగస్టు అనంతరం కావింప నున్న కార్యాలను రూపొందించకండి. వేచి ఉండండి అన్యథా శ్రమపడకుండా ఉండండి.

**- దివాకరుని వెంకటసుబ్బారావు**